క్లుప్తంగా

న్యూడెమోక్రసీ నేతలను కోర్టులో హాజరు పర్చాలి

ఖిలా వరంగల్: వరంగల్ శివారు ఆరెపల్లి వద్ద న్యూడెమోక్రసీ దళ కమాండర్ అబర్ల రాజన్న, జీవన్‌తోపాటు మరో ఇద్దరిని శనివారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు రాచర్ల బాలరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారిపై ఏమైనా కేసులు ఉంటే వారిని వెంటనే కోర్టులో హాజరు పర్చాలని సూచించారు. విప్లవోద్యమంపై గత కొంత కాలంగా ప్రచ్ఛన్న నిర్బంధం కొనసాగుతోందని తెలిపారు. దేశ వ్యాప్తంగా పలు విప్లవ పార్టీల ప్రజా సంఘాల నాయకుల అక్రమ అరెస్టులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్బంధ విధానాలను ప్రజలు ఖండించాలని కోరారు.

రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్‌కు సన్మానం

హన్మకొండ: రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్‌ను బీసీ ఐక్య సంఘర్షణ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి ఏదునూరి రాజమొగిలి సన్మానించారు. హనుమకొండ సుబేదారిలో రియాజ్‌ను ఆయన ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. బీసీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

'అంతరించిపోయే దుస్థితిలో బీఆర్ఎస్ పార్టీ'



కాజీపేట: రాష్ట్రంలో తమకు ఎదురులేదనే స్థాయి నుంచి నామరూపాలు లేకుండా అంతరించిపోయే దుస్థితికి బీఆర్ఎస్ పార్టీ చేరిందని కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఆరోపించారు. కాజీపేట 61వ డివిజన్ తెలంగాణ చౌరస్తాలోని జీఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం కేయూ జేఏసీ నేత డాక్టర్ మేడారపు సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మల్లన్న మాట్లాడారు. పట్టభద్రులు తనను ఆదరించి ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో రజనీకాంత్, తాళ్లపెల్లి సురేష్, బండి శ్రీనివాస్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోరుతూ ప్రచారం



హసన్‌పర్తి: నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి గెలుపు కోరుతూ ప్రచారం నిర్వహించారు. హసన్‌పర్తి మండలం ముచ్చర్లలో ఆదివారం ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సీహెచ్.వెంకటేశ్వర్‌రెడ్డి, సూర ప్రమోద్, చిర్ర రాజేష్, రాము, సుమన్, మట్టెడ కర్ణాకర్, అనిల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయ కమిటీ ఎన్నిక

ఖిలా వరంగల్: వరంగల్ కరీమాబాద్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి కమిటీని 40వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మీర్జా అక్తర్ అధ్యక్షతన ఆదివారం ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అధ్యక్షుడిగా బెజ్జంకి కృష్ణ, ఉపాధ్యక్షుడిగా కంకల మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా ఎక్కులదేవి రమేష్, సహాయ కార్యదర్శిగా రాగి వేణుగోపాల్, కోశాధికారిగా గౌడ రఘు, సహాయ కోశాధికారిగా గౌడ తిరుపతి, పూజారిగా పిల్లలమర్రి హరిహర, ఆలయ ఫౌండర్‌గా పిల్లలమర్రి బాలాజీ, ఆర్గనైజర్లుగా ప్రశాంత్, చంద్రశేఖర్, శ్రీనివాస చారి, కృష్ణ, ముఖ్య సలహాదారులుగా పోతరవేణి రాజన్న, ఎక్కుల దేవి, పరమేశ్వర్, మొగిలిశెట్టి అనిల్‌కుమార్, కొమ్మిని రాజేందర్, దేవేందర్, కార్యవర్గ సభ్యులుగా శ్యామ్, వెంకటేశ్వర్లు, రాంగోపాల్ వర్మ, కిషన్, కర్నాకర్, ప్రకాశ్, రాజు, రవి ఎన్నికయ్యారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మడికొండ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిన సంఘటన కడిపికొండ రాజీవ్ గృహకల్ప వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సంగెం మండలం తూర్పు తండాకు చెందిన బానోతు బాలు(58) తన కూతురు కుటుంబంతో కడిపికొండ ఇందిరమ్మ కాలనీలో నివాసముంటూ కూలీ పనులు చేసుకుంటున్నాడు. తన అల్లుడితో కలిసి పనికి వెళ్లి తిరిగి ఇందిరమ్మ కాలనీకి వస్తుండగా వారిని వెనుక నుంచి ఓ వాహనం ఢీ కొట్టింది. దాంతో తీవ్ర గాయాలైన బాలును చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు బానోతు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ తెలిపారు.

అతివలపై ఆకృత్యాలు

- మూడో కన్నే బాధితులకు అండ
- సెల్‌ఫోన్ వాయిస్ రికార్డ్, వీడియోలే సాక్ష్యాధారాలు
- వేధింపులను ధైర్యంగా ఎదుర్కోవాలని సూచిస్తున్న పోలీసులు



ఖిలా వరంగల్: కుటుంబంలో ఎవరు ఏవిధంగా నడుచుకోవాలో తాతయ్య, అమ్మమ్మలు, పెద్దలు చక్కటి క్రమశిక్షణ నేర్పించేవారు. సమాజంలో నేడు ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. వివాహమైన మరుక్షణమే యువతీ యువకులు తమకు స్వేచ్ఛ కావాలంటూ వేరే కాపురానికి మక్కువ చూపిస్తున్నారు. ఇలాంటి ఈవిధానమే కొంత వేధింపులకు కారణంగా మారుతోంది. ఒంటరి కుటుంబం, ఎవరూ అండగా లేరని అలుసుగా చూస్తూ వేధింపులకు గురిచేస్తున్నారు. ఒకనాడు కుటుంబాలు ఉమ్మడిగా ఉన్నప్పుడు ఆ కుటుంబానికి ఏదైన కష్టం వస్తే ఒక్కరికి ఒక్కరు ధైర్యంగా, అండగా ఉండేవారు. నేడు ఆ విధానం ఎక్కడా కనిపించడం లేదు. విద్యాపరంగా మహిళలు ఎంతో అభివృద్ధి చెందుతూ అన్ని రంగాల్లో ముందడుగు వేస్తున్నప్పటికీ వారికి అడుగడుగునా వేధింపులే ఎదురవుతున్నాయి. అయినప్పటికీ ఆత్మస్థైర్యంతో ధైర్యంగా ఎదుర్కొంటూ నలుగురికి ఆదర్శంగా ఉండాలనే ఆలోచనతో వారు తాము అనుకున్న లక్ష్యానికి వెళ్తున్నారు.

అంతటా ఇదే పరిస్థితి

వరంగల్ నగరంతోపాటు జిల్లాలోని పరిస్థితులను పరిశీలిస్తే ఏదో ఒకచోట లైంగిక వేధింపులు ఉన్నట్లుగా గతంలో పోలీస్ రికార్డుల్లో స్పష్టమవుతోంది. ప్రస్తుతం నగరంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో రాజీమార్గం పేరుతో కేసులు లేకుండా వెలుగులోకి రానివ్వకుండా చేస్తున్నారు. దాంతో బాధితులు తమ కన్నీళ్లను కళ్లలోనే దాచేస్తూ తమ బాధను బయటకు రాకుండా నొక్కిపడుతున్నారు. ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగాలకు వెళ్లే మహిళలు కూడా వేధింపులకు గురవుతున్నారని స్పష్టమవుతోంది. అంతేకాకుండా ఎవరైనా ఒక మహిళ వేరే వ్యక్తితో చనువుగా ఉంటే దాన్ని ఆసరా చేసుకుని బెదిరించి బ్లాక్ మెయిల్ చేస్తున్న సంఘటనలు కూడా ఉన్నాయి. ఉద్యోగాలు చేసే యువతులు, మహిళలకు సైతం ఉన్నతాధికారుల లైంగిక వేధింపులు లేకపోలేదు. నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉండడంతో పదవ తరగతి పాస్ అయిన వారు ఏదో ఉద్యోగం చేయాలని ఆతృత పడుతుంటారు. దాన్ని కొంతమంది అలుసుగా తీసుకుని వారిపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారు. కొంతమంది విధిలేని పరిస్థితుల్లో తలవంచక తప్పడం లేదని తెలుస్తోంది. వేదనకు గురైన మహిళలు పోలీసులకు ఫిర్యాదులు చేసే వారి సంఖ్య తక్కువగానే ఉందని చెబుతున్నారు.

అందుబాటులో అత్యాధునిక పరిజ్ఞానం

ప్రధానంగా ఒంటరిగా కనిపించిన యువతులు, మహిళలను అవకాశం దొరికిందని లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారు. ఇలాంటి సమయంలో మూడో వ్యక్తి ఉండే ఆస్కారమే లేదు. అందుకే అత్యాధునిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చి సెల్‌ఫోన్లు, సీక్రెట్ కెమెరాలు అందుబాటులో ఉన్నాయి. లైంగిక వేధింపులకు పాల్పడేవారి భరతం పట్టడానికి, అలాంటి వారి ఆగడాలు సమాజానికి తెలియచేయడానికి మూడో కన్నే సెల్ ఫోన్. దాంతో సీక్రెట్‌గా కెమెరాతో వాయిస్ రికార్డ్, వీడియో తీస్తే అవే సాక్ష్యాలుగా నిలువనున్నాయి. నేటి యువతులు, మహిళలు వీటిని వినియోగించుకుని తమకు రక్షణగా మలుచుకోగలిగితే ఆకతాయిలు, కామాంధుల వెకిలి వేషాలను అటకట్టవచ్చు. దాదాపు అన్ని సెల్‌ఫోన్లలో వాయిస్ రికార్డ్ అందుబాటులో ఉంటోంది. మరికొన్ని ఫోన్లలో ఫొటోలు తీయడానికి, వీడియో రికార్డింగ్ చేయడానికి అవకాశాలు ఉన్నాయి. యువతులు, మహిళలకు అండగా ఇవి ఎంతో ఉపయోగపడుతున్నాయి. మహిళలు, యువతులు ఎవరితోనైనా మాట్లాడితే తప్పనిసరిగా వాయిస్, వీడియో రికార్డ్ చేయాలి. వారితో ఏవైనా ఇబ్బందులు వస్తే రికార్డులు ప్రధాన ఆధారాలుగా ఉపయోగపడతాయి. ప్రతిఒక్కరూ సెల్‌ఫోన్‌లో రికార్డ్ నమోదయ్యేలా ఏర్పాటు చేస్తే అదే శ్రీరామరక్షగా నిలవనున్నదని పోలీస్ అధికారులు చెబుతున్నారు.

వేధింపులను అరికడుతున్నాం..



నేను బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేరాల తగ్గింపునకు చర్యలు తీసుకుంటున్నా. వాడవాడల్లో పోలీసు గస్తీ, నిఘా మరింతగా పెంచాం. పగలు, రాత్రి వేళల్లో ఆకతాయిలు, పోకిరీల ఆగడాలను అడ్డుకుంటున్నాం. లైంగిక వేధింపుల నివారణకు ప్రత్యేక కృషి చేస్తున్నాం. సెల్‌ఫోన్ ఆధారంగా ఎన్నో కేసులు ఛేదించాం. బాధితుల తరఫున వాయిస్ రికార్డ్, సీక్రెట్ వీడియో సైతం సాక్ష్యంగా ఉపయోపడతాయి. మహిళా చట్టాలపై తరచుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఫిర్యాదు చేసిన వెంటనే కేసులు నమోదు చేసి విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటున్నాం.

\- మల్లయ్య, మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు అండగా అసోసియేషన్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

హన్మకొండ: ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు అండగా ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉంటుందని అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీనివాస్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ వరంగల్ రీజియన్ స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి అసోసియేషన్ కట్టుబడి ఉందని తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తోందని వివరించారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజయ్య నాయక్, చైర్మన్ లాలయ్య, కోశాధికారి మారెపల్లి శేఖర్, వరంగల్ రీజియన్ అధ్యక్షుడు ఎం.రమేష్, కార్యదర్శి టి.శ్రీనివాస కోశాధికారి యూఆర్ కృష్ణ, ఎల్లయ్య, తిరుపతి, స్వామి, మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఓయూ నుంచి ప్రభాకర్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: వరంగల్‌కు చెందిన పూదరి ప్రభాకర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఓయూలోని వాణిజ్యశాస్త్రం విభాగం పరిశోధకుడుగా ఇవాల్యూయేషన్ ఆఫ్ ఇనిస్టిట్యూషనల్ ఫైనాన్స్ ఫర్ అగ్రికల్చర్ ఇన్ తెలంగాణ స్టేట్ ఏ స్టడీ ఆఫ్ సెలెక్ట్ డిస్ట్రిక్ట్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఉస్మానియా యూనివర్సిటీ పరీక్షల విభాగం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆ విభాగం ప్రొఫెసర్ జాస్తి రవికుమార్ పర్యవేక్షణలో ప్రభాకర్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. ప్రభాకర్ కాకతీయ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి.

చైతన్య డీమ్డ్ వర్సిటీ నుంచి మాధురికి..



హనుమకొండకు చెందిన కెమిస్ట్రీ విభాగంలో పరిశోధకురాలు పందిరి మాధురికి హైదరాబాద్‌లోని చైతన్య డీమ్డ్ టు బీ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. సింథసిస్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ నావెల్ బెంజిఇమిడాజోల్స్ అండ్ క్వినాక్సాలిన్ మొయిటీస్ అండ్ థెయిర్ బయాలజికల్ యాక్టివిటీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి మాధురికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ రవీందర్, ప్రొఫెసర్ క్రిస్టోఫర్ నుంచి మాధురికి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఆ విభాగం ప్రొఫెసర్ బి.శ్రీనివాస్ పర్యవేక్షణలో మాధురి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

గెత్సెమనే చర్చిలో పిల్లలకు పోటీలు



డ్రాయింగ్‌ను తిలకిస్తున్న పాస్టర్, చర్చి సభ్యులు

కాజీపేట రూరల్: వేసవిని పురస్కరించుకొని కాజీపేట బాపూజీనగర్‌లోని గెత్సెమనే చర్చిలో స్కూల్ పిల్లలకు నిర్వహిస్తున్న ఒకేషనల్ బైబిల్ స్కూల్ క్యాంప్‌లో భాగంగా ఆదివారం పలు రకాల పోటీలు నిర్వహించారు. ఏడు రోజుల పాటు ఫ్రెండ్‌షిప్ డే, షేరింగ్ డే, డ్యాన్సింగ్ డే, డ్యాన్సింగ్ అండ్ సింగింగ్ డే, టాలెంట్ డే, డ్రాయింగ్ డే, గేమ్స్ డే, ప్రోగ్రామర్ డే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. సోమవారం ముగింపు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు పిల్లలు వేసిన డ్రాయింగ్‌లను ప్రదర్శించగా గెత్సెమనే చర్చి పాస్టర్ బ్రదర్ ఆర్.రవిపాల్, చర్చి సభ్యులు ఓటింగ్ చేసి పిల్లలను అభినందించారు. కార్యక్రమంలో గెత్సెమనే చర్చి సంఘ పెద్దలు పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై రామకోటి స్తూపానికి అర్చనలు



స్తూపం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

మడికొండ: ఏకాదశి సందర్భంగా మెట్టుగుట్టపై ఉన్న రామకోటి స్తూపానికి ఆదివారం ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రామకోటి పుస్తకాలను అందులో నిక్షిప్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రతీ ఏకాదశి రోజు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అర్చకులు విష్ణువర్ధనాచార్యులు, కార్యనిర్వాహణాధికారి శేషభారతి, ధర్మకర్తలు బైరి రాజు, శ్రీనివాస్, రొడ్డ దయాకర్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

'శ్వేతార్క'లో సత్యనారాయణ వ్రతాలు



సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న మహిళలు

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం ఆవరణలోని రామ సహిత సత్యనారాయణ స్వామికి భక్తులు ఆదివారం సామూహిక సత్యనారాయణ వ్రతం జరిపించారు. పరివార సమేత సత్యనారాయణుడికి పంచామృతాలు, నవర సాలతో అభిషేకం చేశారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు ఐనవోలు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ ఆధ్వర్యంలో పండితులు వ్రతాలు చేయించారు. అన్నపూర్ణ భవన్‌లో భక్తులకు మహాన్నదానం చేశారు. కార్యక్రమంలో హరిస్వామి, అరుణ్‌కుమార్ శర్మ, ఆలయ మేనేజర్ రవి, పీఆర్వో అయిత మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యం



సమావేశంలో పాల్గొన్న సంఘం సభ్యులు

వరంగల్ చౌరస్తా: పరస్పరం సహకారం, సమష్టి కృషితోనే పెరిక కుల సభ్యుల అభివృద్ధి సాధ్యమవుతుందని సంఘం నాయకులు చింతకుంట్ల మాధవ్, కిరణ్ కుమార్ అన్నారు. వరంగల్ చార్‌బౌలిలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో పెరిక సేవ పరపతి సంఘం సమావేశాన్ని సంఘ అధ్యక్షుడు శ్రీరామ్ రాజేశ్వర రావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరిక కులస్తులతో ఏర్పాటు చేసిన పెరిక పరపతి సంఘం 36 ఏళ్లుగా విజయవంతంగా నడుస్తోందని తెలిపారు. సంఘ అధ్యక్షుడు శ్రీరామ్ రాజేశ్వరరావు, ఉపాధ్యక్షులు సింగతి సాంబయ్య, ప్రధాన కార్యదర్శి అప్పన మాధవరావు, సహాయ కార్యదర్శి ఏసీరెడ్డి రమేష్, కోశాధికారి బోడకుంట్ల గణేష్ బాబు, సభ్యులు ఎర్రంశెట్టి సతేందర్, దిద్ది అశోక్, ముద్దసాని శ్రీనివాస్, సుంచు నరసింహమూర్తి, బోడకుంట్ల సరళ, శ్రీరామ్ జయప్రభ, ఏసీరెడ్డి రజని, సింగది దివ్య, సరస్వతి, కవిత, వీణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 20న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. భవానీనగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, ఇందిరానగర్, అశోక కాలనీ, వికాస్ నగర్, ఎన్జీవోస్ కాలనీ రోడ్డు, సర్క్యూట్ హౌస్ రోడ్, యాదవనగర్, కృష్ణా కాలనీ, దుర్గా కాలనీ, గౌతమినగర్, రెడ్డిపురం, రెడ్డికాలనీ, పెట్రోల్ పంపు, రాయపుర, లోటస్ కాలనీ, ఆర్ఆర్ గార్డెన్స్ ప్రాంతంలో ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు, చైతన్యపురి కాలనీ, బ్యాంక్ కాలనీ, టీచర్స్ కాలనీ, స్నేహనగర్, శ్రీనగర్ కాలనీ, రాఘవేంద్ర నగర్, క్యాథలిక్ చర్చి, బ్రాహ్మణ వాడ, ప్రశాంతి హాస్పిటల్, నాగుల వీధి, కమ్యూనిటీ హాల్, ఇమ్లీపుర, పింజర్ల, కాజీపేటలోని విష్ణుపురి, సోమిడి, వాటర్ ట్యాంక్, శివారు గ్రామాలు రాంపేట, తరాలపల్లి ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, హనుమకొండ బస్‌స్టేషన్, హనుమకొండ చౌరస్తా, కాకాజీ కాలనీ, టైలర్ స్ట్రీట్ ప్రాంతాల్లో ఉదయం 7గంటల నుంచి 10 గంటల వరకు మడికొండలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హసన్‌పర్తిలో..

హసన్‌పర్తి: మరమ్మతుల కారణంగా చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం మధ్యాహ్నం 3.30గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. దేవన్నపేట, అలియా తండా, మధుతండా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈమేరకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

దంపతుల శరీర దాన అంగీకారం



అంగీకార పత్రాలను ప్రదర్శిస్తున్న సభ్యులు

హసన్‌పర్తి: తమ మరణాంతరం శరీర దానం చేయడానికి వృద్ధ దంపతులు ముందుకు వచ్చారు. ఈ మేరకు పార్థివదేహ అంగీకార పత్రాలను తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ సభ్యుల ద్వారా కేఎంసీకి అందించారు. నగరంలోని గోపాలపురానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు కొండపర్తి ఉమాదేవి – నరసింహాచారి దంపతులు సమాజ హితం కోరి గొప్ప సంకల్పంతో మరణాంతరం తమ పార్థివ దేహాలను మెడికల్ కళాశాల విద్యార్థుల వైద్య విద్య నిమిత్తం ఇవ్వాలని నిర్ణయించారు. ఈమేరకు అసోసియేషన్ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో అసోసియేన్ సభ్యులు ఆ దంపతుల నుంచి అంగీకార పత్రాలు సేకరించారు. అనంతరం కేఎంసీ ప్రిన్సిపాల్ మోహన్ దాస్‌కు అందజేశారు. ఆ ఆదర్శ దంపతులను స్ఫూర్తిగా తీసుకుని శరీర దానం చేయడానికి దాతలు ముందు రావాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో తెలంగాణ నేత్ర, అవయదాన అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు కామిడి సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికాసానికి యోగా దోహదం



చిన్నారులతో యోగా గురువు అశోక్, తదితరులు

ఖిలా వరంగల్: మానసిక వికాసానికి యోగా జీవం లాంటిదని యోగా గురువు అశోక్ ఆర్య తెలిపారు. తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలని, ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులను పూజించాలని సూచించారు. బాల సంస్కార శిబిరంలో భాగంగా వరంగల్ శంభునిపేటలోని హనుమాన్ మందిరంలో హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస శిక్షణ శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలతో యోగాసనాలు వేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీఒక్కరిలో అద్భుతమైన శక్తి ఉంటుందని, ఆ శక్తిని బయటికి తీయడానికి యోగాసనాలు ఉన్నాయని వివరించారు. అనంతరం తల్లిదండ్రులకు పాదాభివందన సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేవులపల్లి దయాకర్, బండారి రవిబాబు, కందగట్ల శ్రీరామ్, కొడిపాక రమేష్, శరత్‌బాబు, వినయ్, రాహుల్, కిరణ్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం)లో పలువురి చేరిక



న్యూశాయంపేట: బీఆర్ఎస్ నుంచి మాత్ర సంస్థ అయిన సీపీఐ(ఎం)లో కారు ఉపేందర్, బొట్ల కుమారస్వామి, రామంచ సారంగపాణితో పాటు న్యూ శాయంపేటలోని జ్యోతిబసు నగర్, పెద్దమ్మగడ్డలోని జ్యోతిబస్‌నగర్ కాలనీకి చెందిన సుమారు పలు కుటుంబాలు ఆదివారం చేరాయి. వారికి కండువాలు కప్పి పార్టీలోకి పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ రావు ఆహ్వానించారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా చేరికల సభను నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సారంపల్లి వాసుదేవరెడ్డి, ఎం.చుక్కయ్య, టి.ఉప్పలయ్య, జిల్లా కమిటీ సభ్యులు గౌడుగు వెంకట్, జి.రాములు, మంద సంపత్, దీప పాల్గొన్నారు.

సుందరయ్య జీవితం స్ఫూర్తిదాయకం



సుందరయ్యకు నివాళులర్పిస్తున్న నాయకులు



కాశిబుగ్గ: ఏసీరెడ్డినగర్ పార్టీ కార్యాలయంలో..



కాజీపేట చౌరస్తాలో..

ఖిలా వరంగల్: కమ్యూనిస్ట్ నేత దివంగత పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సీపీఎం వరంగల్ జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య సూచించారు. వరంగల్ ఉర్సు గుట్ట వద్ద రామా సురేందర్ భవనంలో పార్టీ జిల్లా కార్యాలయంలో సీపీఎం నేత వలదాసు దుర్గయ్య అధ్యక్షతన సుందరయ్య వర్ధంతి సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రంగయ్య మాట్లాడుతూ సుందరయ్య బాల్యం నుంచే క్రమశిక్షణ, దేశభక్తి కలిగి ఉన్నారని, చిన్నతనంలోనే కుల వివక్షకు వ్యతిరేకంగా, తాగునీటి కోసం పోరాడారని, సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్, కిరణ్, శ్రీను, కుమారస్వామి, విజయ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాల యోధుడు సుందరయ్య

కాశిబుగ్గ: ప్రజా పోరాటాల యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం వరంగల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు నలిగంటి రత్నమాల కొనియాడారు. ఏసీరెడ్డినగర్‌లోని పార్టీ కార్యాలయంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రత్నమాల మాట్లాడుతూ పిల్లలను కంటే ప్రజా సమస్యలపై దృష్టి తగ్గుతుందని భార్య లీలమ్మ గర్భసంచిని తొలగించిన మహనీయుడు సుందరయ్య అని గుర్తుచేశారు. జీవితం మొత్తం ప్రజాసేవే లక్ష్యంగా గడిపిన ఆ గొప్ప నాయకుడిని నేటి నాయకులు ఆదర్శంగా తీసుకొని ప్రజాసేవ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగపురి వెంకటేశ్వర్లు, ఆవుల ఉదయ్, భవాని, రాధమ్మ, సాంబన్న, రామస్వామి, లక్ష్మక్క, మేఘమాల, సుజాత, నీలక్క, ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మదిలో నిలిచిన గొప్ప నాయకుడు

కాజీపేట: ప్రజల మదిలో చిరస్మరణీయంగా నిలిచిపోయే పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య అని కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ అన్నారు. కమ్యూనిస్టు నాయకుడు సుందరయ్య 39వ వర్ధంతిని సీపీఎం జిల్లా కార్యవర్గ కార్యదర్శి ఎం.చుక్కయ్య ఆధ్వర్యంలో కాజీపేట చౌరస్తాలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ, ఓరుగంటి సాంబయ్య, జంపాల రమేష్, సంటి రవి, ఎండీ.అలీ, గడ్డం అశోక్, అనిత, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అనిశ్రితరెడ్డికి ప్రథమ బహుమతి



హన్మకొండ కల్చరల్: బెంగుళూరులో నిర్వహించిన నృత్య వసంతం నేషనల్ డాన్స్ ఫెస్టివల్‌లో సీనియర్ విభాగంలో హనుమకొండకు చెందిన ది టెంపుల్ డ్యాన్స్ విద్యార్థిని అనిశ్రిత రెడ్డి కుందూరు ప్రథమ బహుమతి అందుకున్నారు. బెంగుళూరుకు చెందిన కూచిపూడి, భరతనాట్యం ఎక్స్‌పోనెంట్, ఎస్ఎన్ఏ యువ పురస్కార్ అవార్డీ డాక్టర్ వసంతకిరణ్ ఆధ్వర్యంలో ఈనెల 17, 18వ తేదీల్లో జరిగిన ఫెస్టివల్‌లో నృత్యకళాకారిణి, పద్మభూషణ్ అలర్మెల్ వల్లి, మంజుభార్గవి పాల్గొన్నారు.